07ATP27.qxd:07ATP27.qxd 08/09/22 11:15 PM Page 1



## హాజ్‌యాత్రికులకు ఘనంగా వీడ్కోలు



హాజ్‌యాత్రికులను శుభాకాంక్షలతో సాగనంపుతున్న దృశ్యం

**కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :** కళ్యాణదుర్గం పట్టణం నుండి మక్కా హాజ్ యాత్రకు బయలు దేరుతున్న పలు ముస్లిం కుటుంభ సభ్యులకు మాజీ ఉపసర్పంచు శర్మ స్వలి, ఇతర ముస్లిం సోదరులు శుభాకాంక్షలు తెలుపుతూ వీడ్కోలు పలికారు. బుధవారం కళ్యాణదుర్గం నుండి యాత్రకు బయలు దేరుతున్న యాత్రికులకు బహుమతులు కూడా అందించి ప్రజలందరూ క్షేమంగా ఉండేలా ప్రార్థనలు చేయాలని విజ్ఞప్తి చేసారు.

## ఐటిఐ కళాశాలలో జాబ్‌మేళా



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

**ఓబుళదేవరచెరువు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని శ్రీ వెంకటసాయి ఐటిఐ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం యునైటెడ్ ఇండస్ట్రీయల్ ఆటోమోటిమ్ ప్లాస్టిక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గుడిపల్లి వారు జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాకు 35 మంది విద్యార్థులు హాజరు కాగా 23 మంది ఉద్యోగ అర్హత పొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అంజనేయులు మాట్లాడుతూ జాబ్ మేళాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారికి సముచిత ఉద్యోగం కల్పించేందుకు మేళాలు చక్కని వేదికగా ఉపయోపడతాయన్నారు. తమ కళాశాలలో వివిద ట్రేడుల యందు శిక్షణ పొందిన విద్యార్థులు నిరుద్యోగులుగా ఉండకూడదనే ఉద్దేశంతో పలు కంపెనీలతో ఎప్పటికప్పుడు సంప్రదించి నిరుద్యోగ సమస్యను తీరుస్తామని విద్యార్థులకు భరోసా కల్పించారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ తమ కంపెనీలో నిరుద్యోగులకు దశలవారీగా క్యాంపస్ సెలెక్షన్‌లు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా 23 మంది విద్యార్థులకు ఉద్యోగం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, అధ్యాపక బృందం నారాయణస్వామి, ఉత్తన్న, అశ్వనిలు పాల్గొన్నారు.

## పౌష్టిక ఆవారంతోనే తల్లిబిడ్డ క్షేమం

**ఓబుళదేవరచెరువు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**



పౌష్టికాహార సమావేశం

సహజ సిద్ధంగా లభించే పౌష్టికాహారాన్ని గర్భిణిలు, బాలింతలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండడంతో పాటు క్షేమంగా జీవించడానికి అవకాశం ఉంటుందని అంగన్‌వాడీ కార్యకర్త జయమ్మ పిలుపు నిచ్చారు. ఇందులో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణిలు, బాలింతలు పిల్లలకు పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా వారికి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చి ఆరోగ్య సూత్రాలు, ఇతర సలహాలు, సూచనలను తీసుకుని వెళ్లాలన్నారు. మరీ ముఖ్యంగా నిత్యం ఆకుకూరలు, కూరగాయలుతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే తల్లిబిడ్డలు శక్తివంతంగా కావడమే కాక ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. దీంతో పాటు పాలు, కోడిగుడ్లు, పండ్లు విరివిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అఖిల, అంగన్‌వాడీ సహాయకురాలు నాగలక్ష్మిలు పాల్గొన్నారు.

## ఫ్లోరోసిస్ బాధితులకు చేతికర్రలు పంపిణీ చేసిన ఎంపిడిఓ

**ఓబుళదేవరచెరువు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**



చేతికర్రలను పంపిణీ చేస్తున్న ఎంపిపి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఫ్లోరోసిస్ బాధితులకు ఎంపిడిఓ పోలప్ప, డాక్టర్ భాను ప్రకాష్, ఎంపిపి పర్వీన్‌భానులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాల్లో సర్వే నిర వ్వహించి అనుమానాస్పద కేసులను గుర్తించి చేతి కర్రలకు పంపిణీ చేస్తున్నామన్నారు. 16 మందికి ఉచితంగా చేతికర్రలకు అందిచామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోవిందు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌బికె సేవలు..రైతులకు వరాలు..అంతా జగనన్న చలవే

**-రాష్ట్ర ఉపాధ్యక్షునితో మండల చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి

**గోరంట్ల, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహాన్ రెడ్డి ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు రైతులకు వరాలుగా మారాయని అవంతా ముఖ్యమంత్రి జగనన్న చలవేనని ఆర్‌బికెలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారాయని మండల అగ్రి అడ్వైజరీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు. పుట్టపర్తి కార్యాలయంలో వ్యవసాయ మరియు అనుబంధ రంగాల భాగస్వామ్య పక్షాల ముఖాముఖి చర్చా కార్యక్రమాలకు రాష్ట్ర వ్యవసాయ మండలి ఉపాధ్యక్షులు నాగిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చాగోష్టి కార్యక్రమంలో పోతుల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తున్న సేవల గురించి ఆయన కొనియాడారు.

## గ్రామ వాలంటీర్లకు జ్వరాలపై అవగాహన

**ఉరవకొండ, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలో బుధవారం రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యం లో గ్రామ వాలంటీర్లకు జ్వరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. సీహెచ్‌ఓ వి.నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.యండి.షఫీ, సూపర్‌వైజర్ శ్రీధరమూర్తి తదితరులు మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులు, కాలుష్యంవల్ల కలిగే ఆరోగ్య సమస్యలను వివరించారు. అధిక నీటి నిల్వలున్నచోట దోమలు అభివృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా లాంటి జ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. ముఖ్యంగా పగలు కుట్టే టైగర్ దోమవల్ల డెంగ్యూ జ్వరం వస్తుందని దాని నుంచి రక్షణ పొందడానికి వారికి ఒక రోజు డ్రై డే పాటించాలన్నారు. ఇంటి లోపల, బయట నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ కాలుష్యంపై అవగాహనలో భాగంగా క్లీన్ ఎయిర్ ఫర్ బ్లూస్కై అనే నినాదం విశిష్టత గూర్చి వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలన్నారు. ఈ విషయాలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ప్రసాదరావు, బాబా ఫకృద్దీన్, భగవాన్‌దాస్, పంచాయతీ కార్యదర్శి ఎ.వి.రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా నేతల కబ్జాల సంస్కృతికి స్వస్తి పలకాలి

**-పోలీసులను అడ్డుపెట్టుకొని భూకబ్జాదారులను కాపాడితే మీ భరతం పడతాం -మాజీ మంత్రి పల్లెరఘునాథ్ రెడ్డి**



భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని రూరల్ ఎస్‌ఐ బాబ్జాన్‌ను కోరుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి దృశ్యం

**శ్రీసత్యసాయి జిల్లా, సెప్టెంబర్ 07, ప్రభాతవార్త :** భగవాన్ శ్రీసత్య సాయి బాబా నడయాడిన ఈ పవిత్ర పుణ్యక్షేత్రంలో మునుపెన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వంలో కొంత మంది వైకాపా నేతలు భూ కబ్జాలు, దందాలు, దౌర్జన్యాల సంస్కృతులను తీసుకువచ్చారని, వాటికి వెంటనే స్వస్తిపలకాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ బాబ్జాన్ కలసి భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా అసలైన భూ యజమానులతో కలసి కోరారు. నిజమైన హక్కుదారులకు న్యాయం చేయాలని, అవసరమైతే స్థానిక తహశీల్దార్, సబ్ రిజిస్టర్ల సహకారంతో న్యాయ విచారణ చేసి అసలైన భూ హక్కు దారులకు న్యాయం చేయాలని కోరారు. అంతకుమునుపు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా బూ కబ్జాదారులు పుట్టపర్తిలో మరీ విపరీతంగా పెట్రేగి పోతున్నారన్నారు. మంగళవారం మండల పరిధిలోని కప్పలబండ రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 209లో భూ హక్కు దారులకు కాకుండా వైసిపికి చెందిన కొందరు భూమిలోకి ప్రవేశించి టిడిపి సానుభూతిపరులపై అత్యంత దౌర్జన్యంగా భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పోలీసులు రక్షణతో భూ కబ్జాదారులను కాపాడితే మీ భరతం పడతామని, అవసరమైన ప్రజల మద్దతుతో వాటిని ఎండగడతామన్నారు. భూ హక్కుదారులను కాపాడకపోతే వారి తరఫున టిడిపి న్యాయపరోటాం చేస్తున్నాందన్నారు.

## పౌష్టికాహారంతోనే విలువ కట్టలేని ఆరోగ్యం మన సొంతం

**-మాసోత్సవాల్లో పాల్గొన్న ఆర్డీఓ భాగ్యరేఖ**



ఆహార పదార్థాల ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఆర్డీఓ

**గోరంట్ల, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :** ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా నెల రోజుల పాటు జరుగుతున్న పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమాల్లో పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ పాల్గొన్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుశీలసౌభాగ్యవతి ఆధ్వర్యంలో పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాలు, ఆకుకూరలు, కూరగాయలు వంటి ఎగ్జిబిషన్‌ను ఆర్డీఓ పరిశీలించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని వాటి వల్ల లభించే ఆరోగ్యం విలువ కట్టలేదని ఆమె అభిప్రాయపడ్డారు. మహిళలు ఆరోగ్యంగా వుంటే వారి పిల్లలు సైతం సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సరోజానాగేనాయక్, తహాశీల్దార్ రంగనాయకులు, అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడిలో డ్యూటీలో లేని టీచర్‌కు మెమో

**-భూగానపల్లి సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన పిడి రెడ్డి రమణమ్మ**



విద్యార్థులతో మాట్లాడుతున్న పిడి

**గోరంట్ల, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :** అంగన్‌వాడి సెంటర్ల పనితీరును పరిశీలించడంలో భాగంగా బుధవారం సత్యసాయి జిల్లా ఐసిడిఎస్ పిడి రెడ్డి రమణమ్మ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని భూగానపల్లి గ్రామంలోని అంగన్‌వాడి సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ సమయంలో విధులకు ఇంకా టీచర్ హాజరు కాలేదని గుర్తించడం, సెంటర్‌కు సంబంధించి రికార్డులు అస్తవ్యస్తంగా వుండడాన్ని తనిఖీలో గుర్తించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై వారి నిర్లక్ష్యంపై టీచర్ భారతికి మెమో జారీచేసినట్లు పిడి తెలిపారు. పిడి వెంట ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుశీలసౌభాగ్యవతి వున్నారు.

## మహిళా సమస్యలపై ఉద్యమిస్తా

**-రాష్ట్ర బిజెపి మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు సుమతి సురాతని**



వజ్రబాస్కర్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న సుమతి సురాతని

**పుట్టపర్తి, సెప్టెంబర్ 07, ప్రభాతవార్త :** రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమిస్తానని భాజపా మహిళా మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుమతి సురాతని పేర్కొన్నారు. శ్రీసత్యసాయిల్లా కదిరి పట్టణానికి చెందిన ఆమె సేవలను గుర్తించిన భాజపా అధిష్టానం ఆమెను రాష్ట్ర మహిళా మోర్చ ఉపాధ్యక్షురాలిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్బగా సుమతి సురాతని మాట్లాడుతూ, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోమువీర్రాజు ఈ మేరకు మహిళా అధ్యక్షురాలు నిర్మల కిషోన్, జిల్లా ఇన్‌చార్జ్ చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు వజ్రభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉత్తమ్ రెడ్డికి మరియు తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నాన్నారు. భారతీయజనతా పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, క్షేత్రస్థాయిలో పనిచేస్తానన్నారు. అదే విధంగా భా.జ.పా మహిళా మోర్చాను శ్రీసత్యసాయి జిల్లాలో బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎళ్ళవేళలా పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, ప్రధాన నరేంద్ర మోడిని స్పూర్తిగా తీసుకొని బిజెపి పార్టీ కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

**కణేకల్లు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**

కణేకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 9 అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీకి నోటిఫకేషన్ విడుదల చేసినట్లు సిడిపిఓ ఎల్లమ్మ తెలిపారు. అర్హత కలిగి ఉండి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు బుధవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు స్థానిక సిడిపిఓ కార్యాలయంలో దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 13వ తేది తుదిగడువు కావడంతో గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

## పండ్లతోటల పెంపకంతో రైతులకు లాభదాయకం

**- శ్రీ సత్యసాయి జిల్లా డ్వామా పిడి రామాంజినేయులు**



పనులను ప్రారంభిస్తు డ్వామా పిడి రామాంజినేయులు

**కనగానపల్లి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :** ప్రతి రైతు పండ్ల తోటలు పెంపకంతో రైతులు ఆర్థికాభివృద్ధికి దోహదపడుతాయని శ్రీ సత్య సాయి జిల్లా డ్వామా పిడి రామాంజినేయులు అన్నారు. మండల పరిధలోని ముక్తాపురం గ్రామంలోని రైతులకు ఉపాధిహామీ ప్రద కింద పండ్ల తోటల పెంపకం పనులను, రైతు పొలంలో ఆయన స్వయంగా గుంతల తవ్వకాల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైలాండ్ హార్టికల్చర్ కింద పండ్ల తోటలు పెంచుకునే రైతులకు అయ్యే ఖర్చును ప్రభుత్వం అందిస్తుందని అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఏపిడి శివశంకర్, ఏపిఓ సుధాకర్, సికెపల్లి ఏపిఓశంకర్, టెక్నికల్‌అసిస్టెంట్లు మారప్ప,సోమశేఖర్, విజయభాస్కర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు మహేష్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## పేరూరు డ్యాంకు పోటెత్తిన వరద నీరు

**- కర్ణాటక నుంచి భారీ వరద**



ఐదు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్న దృశ్యం



పూర్తిస్థాయిలో నిండిన డ్యాం

**రామగిరి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :** మండలంలోని పేరూరు అప్పర్ పెన్నార్ డ్యాంకు భారీగావరద పోటెత్తింది. ఎగువప్రాంతమైన కర్ణాటకలో భారీ వర్షాలు రావడంతో వరద ఎక్కువైంది. దీంతో బుధవారం అధికారులు ఐదు గేట్లను ఎత్తి నీటిని దిగువ కు వదిలారు. దాదాపు 20 వేల క్యూసెక్కులకు పైగా వరద నీరు వస్తుండటంతో కిందికి కూడా 25వేలకుపైగా క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. డ్యాం సామర్థ్యం 18 టీఎంసీలు కాగా ఈ 45 రోజుల నుంచి 10 టీఎంసీల వరకు నీటిని కిందకు వదిలినట్లు అధికారులు తెలిపారు. పేరూరు డ్యాం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా డ్యాంకు వరద పోటెత్తడం, ఐదు గేట్లను వదలడం కూడా ఇది మూడోసారి ఇప్పుడు కూడా వరద భారీగా వస్తుండటంతో లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ పేర్కొన్నారు. రామగిరి మండలం పేరూరు కనగానపల్లి మండలంలోని కోనేటినాయని పాలెం, కంబదూరు మండలంలోని రాళ్ల అనంతపురం, దూల్యం, కొత్తూరు, కర్తనపర్తి, నూతిమడుగు తదితరగ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## భూమిలేని రైతులను గుర్తించడం కోసమే గ్రామ సభలు

**- తహాశీల్దారు నీలకంఠారెడ్డి**



గ్రామ సభలో మాట్లాడుతున్న తహాశీల్దారు నీలకంఠారెడ్డి

**ధర్మవరం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :** మండలంలోని భూమిలేని రైతులను గుర్తించి ప్రభుత్వ ఆదేశాల మేరకు భూ పంపిణీ చేయడం కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహాశీల్దారు నీలకంఠారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 1వ తేది నుంచి 8వ తేది వరకు మండల పరిధిలోని గ్రామాలలో గ్రామ సభలను నిర్వహించడం జరుగుతోంది. ఇందులో భాగంగానే బుధవారం పోతుల నాగేపల్లి, రేగాటిపల్లి గ్రామాలలో తహాశీల్దారు నీలకంఠారెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం భూ పంపిణీకి శ్రీకారం చుట్టిందని, గత వారం రోజులుగా గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి భూమిలేనిపేద రైతులను గుర్తించడం జరుగుతోందన్నారు. అనంతరం భూ పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికే చాలా మంది పేద రైతులు ఈ గ్రామ సభను సద్వినియోం చేసుకోవడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓ భాస్కర్, పంచాయితీ కార్యదర్శి మురళీ, గ్రామ సర్పంచు వెంకటరామిరెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## లారీని ఢీ కొట్టిన కారు ఒకరు మృతి



ప్రమాదంలో మృతిచెందిన అక్షయ



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

**చెన్నేకొత్తపల్లి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :** ఆగి ఉన్న లారిని వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందిన ఘటన చెన్నేకొత్తపల్లి మండలంలో బుధవారం చోటు చేసుకుంది. చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ శ్రీధర్ తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా కసనూరుకు చెందిన అక్షయ (21) సన్ ఆఫ్ బసవయ్య స్వామి మారుతి సుజుకి స్విఫ్ట్ డిజైర్ వాహనం లో వెళ్తుండగా చెన్నేకొత్తపల్లి సమీపాన 44వ జాతీయ రహదారిపై, సెవెన్ హిల్స్ డాబా దగ్గర ఆగి ఉన్న లారీని ఢీ కొట్టడంతో అక్షయ అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కణేకల్లు-ఉరవకొండ రహదారి మూసివేత

**కణేకల్లు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :**

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బిటి ప్రాజెక్టులోకి అధికంగా నీరు వచ్చి చేరడంతో అధికారులు బుధవారం బిటి ప్రాజెక్టు నుంచి 10 గేట్లు ద్వారా నీటిని అధికంగా వదలడం వలన కణేకల్లు నుంచి ఉరవకొండ వెళ్లే దారి మూసివేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ ఇతర రహదారులు పట్టుకుని వెళ్లడం కనిపించింది.

## పేదల కడుపు నింపుతుంటే జగన్‌కు కడపుమండుతోంది

**-జనం వైకాపాను మరిచిపోతారన్న భయంతోనే అన్నక్యాంటీన్‌లపై దాడులు-మాజీ మంత్రిపల్లె రఘునాథ్ రెడ్డి**

**శ్రీసత్యసాయి జిల్లా, సెప్టెంబర్ 07, ప్రభాతవార్త ప్రతనిధి:**



అన్న క్యాంటీన్‌ల ద్వారా అన్నదానం చేస్తున్న మాజీ మంత్రి పల్లె, తెదేపా నాయకులు దృశ్యం

అన్నక్యాంటీన్ల ద్వారా తెలుగుదేశం పార్టీ పేదల కడుపు నింపుతోందటే అదిచూసి ఓర్వలేక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహాన్ రెడ్డి కడుపుమంటతో రగిలిపోతున్నారని మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి కేంద్రమైన పుట్టపర్తిలోని సత్యమ్మ దేవాలయం వద్ద అన్నక్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, పేదల కడుపునింపే కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ చేపడుతుంటే అది చూసి ఓర్వలేని జగన్, వైసిపి అన్నా క్యాంటీన్‌లపై విధ్వంసం సృష్టిస్తున్నారని, ఎన్ని అన్నక్యాంటీన్లు ధ్వంసంచేసినా పేదలకు అన్నదానం చేసి తీరుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అధికారంలోకి రావడం ఖాయమని, ఓటమి భయం పట్టుకోవడంతోనే రాష్ట్రంలో తెదేపా నాయకులపైన దాడులు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో వైసిపి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, ప్రజలే తగిన బుద్ధిచెబుతారన్నారు. ఇకపై అన్న క్యాంటీన్లపై దాడులు చేస్తే నడిబజార్లో అన్నదానకార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజా మద్దతుతో ఈ ప్రభుత్వంపై తిగరబడతామని హెచ్చరించారు. అనంతరం టిడిపి కార్యకర్త ఆటో రామాంజి మనుమరాలుకేశఖండన కార్యక్రమంలో పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కన్వీనర్ రామాంజినేయులు, సీనియర్‌నాయకులు ఓబులేసు, పుల్లప్ప, శ్రీరామ్‌రెడ్డి, సామకోటి ఆదినారాయణ, గంగాదర్ నాయుడు, సురేష్ నాయుడు, దేవేంద్రనాథ్ రెడ్డి, బేకరీ నాయుడు, మురళీ,మనోహర్, శేఖర్, కరణం సుబ్రమణ్యం స్వామి, చంద్రశేఖర్, వెంకటరెడ్డి, రమేష్, శుభచంద్ర, రామాంజి,వెంకటరాముడు, శేషు, పాపిరెడ్డి, కిరణ్, రాజప్ప, సత్యనారాయణ తదిరతులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఫోరం ఆఫ్ రిజిస్ట్రర్డ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఫోర్టో) చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రెటరీ జనరల్ సామల సింహాచలం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని లక్ష 90 వేలమంది ఉపాధ్యాయులు, ఉద్యోగులకు జీవన్మరణ సమస్యగా మారిన సిపిఎస్ విధానంపై గత దశాబ్ద కాలంగా దేశ వ్యాప్తంగా పోరాటం జరుగుతోందన్నారు. ఫలితంగా రాజస్థాన్, ఛత్తీష్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాలు సిపిఎస్ విధానాన్ని రద్దు చేయడం గమనార్హం అన్నారు. అదే బాటలో మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యామ్నాయ విధానాలు కాకుండా సిపిఎస్‌రద్దు చేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింప చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఫోర్టో పక్షాన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ సంఘాలను చర్చలకు ఆహ్వానిస్తూఓపిఎస్ బదులుగా జీపిఎస్ విధానాన్ని అమలు చేస్తామని చెబుతుండడం ఆమోదయోగ్యం కాదన్నారు.

## బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు నిలిపివేయండి

**- హెచ్‌ఎల్‌సి కార్యనిర్వాహక ఇంజినీర్ యం.వి.రమణారెడ్డి**

**అనంతపురం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త బ్యూరో :** హెచ్‌ఎల్‌సి అక్విడక్ట్ బ్రిడ్జి శ్లాబుల్లో వాహనాలు తిరిగి చీలికలు ఏర్పడ్డాయని, బ్రిడ్జి కూడా శిథిలావస్తకు చేరుకుందని కావున ప్రజల రాకపోకలు, వాహనాల రాకపోకలు నిలిపివేయాలని హెచ్‌ఎల్‌సి కార్యనిర్వాహక ఇంజినీర్ యం.వి.రమణారెడ్డి మండల తహాశీల్దారు, పోలీసు అధికారులకు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. బ్రిడ్జి కింద హగిరి నది ఉధృతంగా ప్రవహిస్తోందని, బిటిపి డ్యాం నుంచి దాదాపు 60వేల క్యూసెక్కులనీళ్లు హగిరినదికు వదలడం జరిగిందన్నారు. కావున కణేకల్లు వద్దనున్న అక్విడక్ట్ బ్రిడ్జి కింద హగిరి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉంది కావున వెంటనే ప్రజలకు తెలియజేయాలని కోరారు. అదే విధంగా ఎపిఎస్ ఆర్టిసి బస్సులను సైతం తిప్పరాదని కోరుతున్నట్లు అందులో పేర్కొన్నారు.

## పథకాలను ప్రజల దరికి చేర్చండి.. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోండి

**- జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్**



సచివాలయంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్.

**పామిడి, సెపెంబర్ 07 ప్రభాతవార్త :** సంక్షేమ పథకాలను ప్రజల ధరికి చేరుస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. మండల పరిదిలోని ఎద్దులపల్లి సచివాలయాన్ని బుధవారం సందరి ్శంచిన జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ రైతులతో సమావేశం ఆయ్యారు. పిఎం కిసాన్ సమ్మాన్ పథకానికి రైతులు ఈ-కేవైసీ చేయించుకుని పెండింగ్‌లో ఉన్నటువంటి పంటల భీమా, ఇన్పూట్ సబ్సీడీని పొందాలని కోరారు. ప్రజల సమస్యలపై తక్షణం స్పందించి వాటికి పరిష్కారం చూపించాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు సంబందించిన పోస్టర్లను ప్రదర్శిస్తూ వాటిని ప్రజలకు అందించటానికి కృషి చేయాలని తెలిపారు. ఆనంతరం ఆర్బీకే నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ త్వరతగతిన పనులను పూర్తి చేయాలని సంబందిత కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర, ఏఈఓ శ్రీనివాసరావు, ఆర్బీకే ఇన్‌చార్జ్ అధినారాయణ, గ్రామ సర్పంచ్ వెంకటరత్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు సుధాకర్‌శర్మ, సచివాలయ ఉద్యోగులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బుగ్గయ్యచౌదరి జన్మదిన వేడుకలు

**అనంతపురం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త బ్యూరో :** రాష్ట్ర తెలుగు దేశం పార్టీ కార్యదర్శి సీనియర్ నాయకులు బుగ్గయ్యచౌదరి జన్మదినం సందర్భంగా ఆయన నివాసంలో తెలుగు దేశం పార్టీ మాజీరాష్ట్ర పార్టీ కార్దయర్శి కేఎం జక్కివుల్లా రాష్ట్ర కార్యదర్శి జెఎల్ మురళీ, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళీమోహన్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గౌస్, రాష్ట్ర తెలుగు యువత ప్రదాన కార్యదర్శి లింగారెడ్డి, నగర పార్టీ మాజీ అధ్యక్షులు కృష్ణకుమార్ తదితరులు పాల్గొని కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

05ATP07.qxd:05ATP07.qxd 08/09/22 10:42 PM Page 1



## నాడునేడు పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే



నాడునేడు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

**కదిరి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

మున్సిపల్ పరిధిలోని సైదాపురం ప్రభుత్వ పాఠశాలల్లో రూ 16 లక్షలతో మనబడి నాడు-నేడు పథకం కింద చేపట్టే పలు అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే సిద్ధారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు విద్యాకానుకు కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ ప్రభుత్వ పాఠశాలలను కార్పో=రేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కిన్నెర కళ్యాణ్; రంగారెడ్డి, మహమ్మద్, ఖాసీం, ఓంప్రకాష్, కో ఆప్షన్ అమీర్, సివిల్ సప్లయ్ డైరెక్టర్ జగన్‌యాదవ్, వైస్ ఎంపిపి ఆనంద్‌నాయక్ పాల్గొన్నారు.

## గుడి ప్రారంభోత్సవంలో పూల శ్రీనివాసరెడ్డి

**పూజా కార్యక్రమంలో పాల్గొన్న సిఈసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి**



**నల్లచెరువు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని బాలేపల్లి తాండా గ్రామం నందు నూతనంగా నిర్మించబడిన మారెమ్మ గుడి ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైసిపి సిఈసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు అనీల్‌కుమార్‌రెడ్డి, జెడ్పిటిసి విశ్వనాథ్‌రెడ్డిలు పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. సర్పంచ్ హైటెక్ రమణ, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం సీఈసి సభ్యులు శ్రీనివాసరెడ్డి అమ్మవారికి దేవాలయం అభివృద్ధి పనులకు గాను రూ. 20000 రూపాయలు అందజేశారు. సత్యమైన దేవుడు మారెమ్మ స్వామి అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలకు వైసిపి నాయకులకు చల్లగా దీవించాలని మ్రొక్కులు తీర్చుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో సమీవుల్లా మరియు బాలకృష్ణ, రమేష్, రామాంజులు, గోవింద్ తిరుపాల్, రవి, బాబు, నరసింహులు, రామాంజులు, శంకర్‌నాయక్, పూల ప్రకాష్, పూల సురేంద్రరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, బాలకృష్ణనాయక్, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి పట్టాలు మంజూరు చేస్తాం

**గాండ్లపెంట, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:**



గామ సభలో పాల్గొన్న తహసిల్దార్

అర్హులైన రైతులందరికీ పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తామని తహసిల్దార్ రవి పేర్కొన్నారు. భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మలమీదపల్లి, సామచేనుబైలు గ్రామాల్లో బుధవారం రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ఆధీనంలో ఉన్నటువంటి భూములకు పట్టారు మంజూరు చేయాలని రైతులు అధికారులకు విన్నవించారు. ముఖ్యంగా ఎన్నో ఏళ్ళుగా తాము సాగు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం ఇంతవరకు తమ భూములకు పట్టాలు గ్రామ సభలో తెలియజేశారు. పై రెండు గ్రామాలలో దాదాపు 169 మంది రైతులు అధికారులకు వినతీపత్రాలు అందజేశారు. అనంతరం తహసిల్దార్ మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ పట్టాలు మంజూరు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అశోక్, విఆర్ఓలు రఘు, అమానుల్లా, రమణ, సర్వేయర్ ఆనంద్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

## కేసుల్లో పట్టుపడిన మద్యం ధ్వంసం

**నల్లమాడ సెప్టెంబర్ 07 ప్రభాతవార్త,**



అక్రమ మద్యాన్ని ధ్వంసం చేస్తున్న దృశ్యం

పలు ఎక్సైంజ్ కేసుల్లో పట్టుపడిన రూ.1,16,485 విలువ చేసే మద్యాన్ని బుధవారం నల్లమాడలో సెబ్, స్థానిక పోలీసులు ధ్వంసం చేశారు. నల్లమాడ సిఐ నిరంంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు ..30కేసుల్లో సీజ్ చేయబడిన కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 313.13 లీటర్ల మద్యం, 24 కేసుల్లో స్వాదీనం చేసుకున్న 181 లీటర్ల నాటుసారాను చిల్లగోర్లపల్లి రహదారి ప్రక్కన కుంటలో టిప్పర్ వాహనంతో తొక్కించి ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. మద్యం, నాటుసారా మొత్తం విలువ రూ.1,16,485గా తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం రవాణా చేసినా, నాటుసారా తయారు చేసి విక్రయించినా కఠిన చర్యలు తప్పవని సెబ్ సిఐ మాదవి, సిఐ నిరంజన్‌రెడ్డి ఈ సందర్భంగా హెచ్చరించారు. సెబ్ ఎస్ఐ రాజన్న, నల్లమాడ ఏఎస్ఐలు వజదుల్లా, సురేంద్ర, జమేదార్ జగదీష్‌బాబు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## ఆడపిల్లల ఓపెన్ జిమ్ కోసం దాదిమి విశ్వనాథ్‌రెడ్డి రూ.5 లక్షల విరాళం

**మాట్లాడుతున్న విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచు షబ్బీర్‌లు**



**అమడగూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**

మండలంలో ఆడపిల్లల ఓపెన్ జిమ్ కోసం కంచర్లవాండ్లపల్లి గ్రామ నివాసి, సన్‌యుగ ఇన్ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ యువ పారిశ్రామికవేత్త దాదిమి విశ్వనాథ్‌రెడ్డి 5 లక్షల రూపాయలను విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా అమడగూరు సర ్పంచు షబ్బీర్ ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచు షబ్బీర్ మాట్లాడుతూ దాదిమి విశ్వనాథ్‌రెడ్డి అమడగూరు మండలంలో పుట్టిపెరిగి హైదరాబాద్‌లో స్థిరపడినప్పటికి మండలంపై వున్న మమకారంతో మండల ప్రజలకు దేవాయాలలకు, శుభకార్యాలకు, విద్యార్థులకు ఎనలేని సేవలు తనంతు సహాయ సహకారాలు అందచేస్తూ తుమ్మల పంచాయతీని దత్తత తీసుకుని గ్రామంలోని ప్రతి సమస్యపై ఆరా తీసి వాటిని వెంటనే పరిష్కరిస్తున్న దాదిమి విశ్వనాథ్‌రెడ్డికి మండల ప్రజలు ఎప్పుడూ రుణపడి వుంటారన్నారు. హైదరాబాద్‌కు వెళ్లిన తమను ఎంతో ప్రేమాభిమానంతో ఆహ్వానించి మమ్ములను గౌరవించి ఆడపిల్లల ఓపెన్ జిమ్ కోసం విరాళం అడుగగానే 5 లక్షలు అందచేయడం సంతోషంగా వుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమడగూరు సహకార బ్యాంకు అధ్యక్షులు బొమ్మిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, తుమ్మల సర్పంచు రంగారెడ్డి, ఎర్రగుండ్ల సోమశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత త్రాగునీటి ప్లాంట్‌లను ప్రారంభించిన పూల



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసులురెడ్డి

**తలుపుల,సెప్టెంబర్07,ప్రభాతవార్త:**

మండలపరిదిలోని పెద్దన్నవారిపల్లి పంచాయితీలో గల కేతిరెడ్డివారిసల్లి గ్రామం నందు,అదే పంచాయితీలోని సంకటివారిపల్లి నందు ఏర్పాటు చేసిన ఉచిత త్రాగునీటి ప్లాంట్‌ను రాష్ట్ర సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు.కేతిరెడ్డివారిపల్లి గ్రామానికి చెందిన పూల రాజశేఖర్‌రెడ్డి కుమార్తె మౌనిక జ్ఞాపకార్థం వాటర్ ప్లాంట్‌లను వితరణ చేసినట్లు తెలిపారు.గ్రామాల్లో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండటం చాలామంది ప్రజలకు కీళ్ళనొప్పులు,మోకాళ్ళనొప్పులు రావడం జరుగుతోంది.దానిని దృష్టిలో పెట్టుకొని వాటర్‌ప్లాంట్‌ల ద్వారా ఉచితంగా త్రాగునీరందించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పూల వేణుగోపాల్‌రెడ్డి,ఆవుల గిరిధర్‌రెడ్డి,సురేంద్రారెడ్డి, సుదాకర్‌రెడ్డి,తదితర వైయస్సార్‌పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపుగా పెరిగిన ముళ్లపొదలు తొలగించండి



గృహాలపైకి పాకుతున్న ముళ్లపొదలు

**అమడగూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**

మండలంలోని ఏ.కొత్తపల్లి గ్రామంలోని మండల ప్రజాపరిషత్ పాఠశాల పాత భవనం చుట్టూ ఏపుగా పెరిగిన ముళ్లపొదలను తొలగించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల పాత భవనం ప్రధాన రహదారి పక్కనే వుండడంతో పాటు పాఠశాల ప్రహరీ ప్రమాదానికి పొంచివుందన్నారు. పాఠశాల గదుల చుట్టూ ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో పాటు ఇళ్ల మీదకు తీగలు వస్తుండడంతో విషపురుగులు ఇళ్లలోకి వచ్చే ప్రమాదం వుందన్నారు. చిన్నారులు ఎక్కువ శాతం ఈ పాఠశాల ముందు ఆడుకుంటూ వుంటారని గతంలో ఈ చెట్ల ద్వారా ఇళ్లలోకి విషపురుగు చేరి చల్ల నాగరాజు అనే వ్యక్తి ఇంటిలో నిద్రిస్తుండగా అతన్ని కుట్టడం జరిగిందన్నారు. దీంతో అతను మృతి చెందడం జరిగిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు స్పందించి పాత పాఠశాల భవనం సముదాయంలో ముళ్లపొదలను తొలగించి శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మహమ్మదాబాద్‌లో గ్రామసభ



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

**అమడగూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**

మండలంలోని మహమ్మదాబాద్ సచివాలయంలో బుధవారం తహశీల్దార్ రెడ్డిశేఖర్ గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభలో ఆయన రైతులతో మాట్లాడుతూ 5 ఎకరాలలోపు వున్న వారు కొన్ని సంవత్సరాల నుండి సాగుచేసుకుని పంట పెట్టుకుంటున్న అనుభవంలో బంజరు భూమిని ఒక ఎకరాగాని రెండు ఎకరాల గాని పాసుపుస్తకాలు చేయించుకోవడానికి అనుమతి వుంటుందని భూమి గడిచిన కొన్ని సంవత్సరాల్లో వారి అనుభవంలో వుండవలెనని తమ సాగుచేసుకుంటున్న బంజరు భూముల వివరాలను దాదాపు 90 మంది దరఖాస్తులను అధికారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఈశ్వరయ్య, పంచాయతీ సర్పంచు ఆది, కార్యదర్శి సునియబేగం, విఆర్ఒ నాగప్ప, రైతులు, పాల్గొన్నారు.

## హర్ ఘర్ జల్ కార్యక్రమంపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓఆర్డి ఆనందయ్య

**తనకల్లు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**

గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం), జల జీవన్ మిషన్ వారి సూచనల మేరకు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశాల మేరకు తనకల్లు స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఇఓఆర్డి ఆనందయ్య అధ్యక్షతన ఈ రోజు జల జీవన్‌మిషన్, హర్‌ఘర్ జల్ అంశాలపైన మండల స్థాయి విలేజ్ సెక్రెటరీలకు జల జీవన్ మిషన్ జిల్లా మేనేజర్ నాగాంజన్‌రెడ్డి, రైసెస్ సంస్థ చైర్మన్ గోపాల్ రెడ్డి గార్లు అవగాహన కల్పించారు. జలజీవన్ మిషన్ ముఖ్య ఉద్దేశ్యం, అనగా ప్రతి ఇంటికీ నీటా కొళాయి కనెక్షన్ ఇవ్వడం, ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పూల శ్రీనివాసులు, డిఎల్‌పిఓ అంజినప్ప ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ కవిత, రమణారెడ్డి, విలేజ్‌సెక్రెటరీ, రైసెస్ సంస్థ సిబ్బంది ప్రసాద్, ఆనంద్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ పనులను వేగవంతం చేయండి

**ఓబుళదేవర చెరువు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ సచివాలయ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌లకు బుధవారం ఎంపిడిఓ ఏలాన్ ఆదేశించారు. ఈ సందర్భంలో ఆయన సచివాలయం, హెల్త్‌సెంటర్‌ల నిర్మాణ పనులను పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అనంతరం ఎంపిడిఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పనులను పూర్తి చేస్తే ప్రజలకు అన్ని రకాలు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తాయాన్నారు. గ్రామంలో జలజీవన్ పథకం కింద ఇంటింకి కొలాయిలు ఏర్పాటు చేసేందుకు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నారప్పగారిపల్లి పాఠశాలను తనిఖీ చేసి పిల్లలకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా నని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వంటలు బాగా చేస్తున్నారని చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఎంపిటిసి బైముతక శ్రీనివాసులు, వైసిపి నాయకులు చెన్నారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దీపికలు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఓ

## రాయల "చెరువు" మరువ పారుతోంది

**-పూజలు చేసిన హార్షవర్ధన్‌రెడ్డి -తిలకించేందుకు వస్తున్న జనం**

**యాడికి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**



చెరువులో పూజల్లో పాల్గొన్న హార్షవర్ధన్‌రెడ్డి

వర్షాలు అధికంగా కురుస్తుండడంతో రాయలనాటి రాయల "చెరువు" నిండి మరువ పారుతోంది. దీంతో నీటి పారకాన్ని తిలకించేందుకు స్థానిక జనం పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. మండలం లోని రాయలచెరువు గ్రామంలో వందలాది ఎకరాల విస్తీర్ణంలో గల చెరువు చాలా కాలం తరువాత నిండింది. దీంతో వైకాపా నాయకుడు కేతిరెడ్డి హార్షవర్ధన్‌రెడ్డి చెరువు వద్దకు చేరుకుని గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఇలా ప్రతి ఏడాది చెరువు నిండాలని గంగమ్మను వేడుకున్నారు. ఆయన వెంట మాజీ జెడ్‌పిటిసి వెంకటరామిరెడ్డి, కన్వీనర్ బొంబాయి రమేష్, సీనియర్ నాయకులు భోగాతి బ్రహ్మానందరెడ్డి, యాడికి ఉపసర ్పంచు కాసా చంద్రమోహన్, తలారి నాగేష్, వైకాపా నాయకులు వున్నారు.

## చాగల్లు నుండి పెన్నానదికి నీరు విడుదల

**-పెన్నా పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - తహశీల్దార్ షర్మిల**

**పెద్దపప్పూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**



చాగల్లు నుండి ప్రవహిస్తున్న నీరు

మండలంలోని చాగల్లు ప్రాజెక్ట్ నుండి 7 గేట్లు ఎత్తి బుధవారం పెన్నానదికి నీటిని విడుదల చేశారు. దాదాపు 1500 క్యూసెక్కుల నీరు పెన్నానదిలోకి వదలడంతో పెన్నానది పరుగులు తీస్తోంది. దీంతో పెన్నా పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని తహశీల్దార్ షర్మిల హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే గ్రామాల్లో రెవెన్యూ, పోలీసు అధికారులు గ్రామస్తులను అప్రమత్తం చేశారు. జూటూరు, నరసాపురం, అశ్వత్థం, గార్లదిన్నె గ్రామాల మధ్య వున్న పెన్నానదిపై కల్వర్టుల మీదుగా వాహనాల రాకపోకలు జరగకుండా పూర్తిగా మూసివేశారు. పెన్నానది వైపు చేపల వేటకు, ఈతకు, విహారయాత్రకు వెళ్లవద్దని హెచ్చరించారు.

## గంగమ్మకు మాజీ ఎంపిపి పూజలు

**యాడికి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**



పూజల్లో పాల్గొన్న మాజీ ఎంపిపి, నాయకులు

టిడిపి మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య ఆధ్వర్యంలో గంగమ్మకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరుణుడి కరుణతో రాయల చెరువు నిండడంతో అక్కడికి వెళ్లి టెంకాయలు కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా పెద్దఎతున్న అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మాదాల అనిల్‌కుమార్, మెకానిక్ బాబు, నాగరాజుగౌడ్, శివ, చరణ్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

## ఎబివిపి సభ్యత్వ నమోదు ప్రారంభం



విద్యార్థులతో సభ్యత్వ నమోదు చేయించిన దృశ్యం

**తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**

2022-23 విద్యాసంవత్సరానికి గాను అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) సభ్యత్వ నమోదు తాడిపత్రి పట్టణంలో ప్రారంభమైనట్లు ఎబివిపి జిల్లా కన్వీనర్ అఖిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రతి కళాశాల విద్యార్థి 5 రూపాయలు, పాఠశాల విద్యార్థి 2 రూపాయలు చెల్లించి సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. దేశంలోనే అతి పెద్ద విద్యార్థి సంఘం ఎబివిపి అని అబివిపి అన్ని విద్యార్థి సంఘాల మాదిరిగా కాకుండా విద్యారంగ సమస్యలతో పాటు విద్యార్థుల్లో జాతీయ భావాలను దేశభక్తిని పెంపొందించేవిధంగా పనిచేస్తోందన్నారు. కావునా పట్టణంలోని పెద్దఎత్తున విద్యార్థులు సభ్యత్వం తీసుకుని ఎబివిపిని మరింత పటిష్టం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, మంజు, కార్తీక్, భాను, మంజునాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇద్దరు దొంగలు అరెస్ట్ - బంగారు ఆభరణాలు, స్కూటీ స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ

**తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**

పట్టణంలో ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 10 తులాల బంగారు ఆభరణాలు, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జ్ సిఐ రామకృష్ణ తెలిపారు. స్థానిక పట్టణ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ పట్టణంలోని నాగులకట్ట వద్ద నివాసం వుంటున్న ముసలివాళ్ల ఇంటిలోకి షేక్‌మహమ్మద్, షేక్‌జాఫర్ అనే ఇరువురు నిందితులు చొరబడి ముసలివాళ్లను కొట్టి కత్తితో బెదిరించి సుబ్బరత్నమ్మ అనే మహిళ మెడలో వున్న మాంగల్యంచైను, ఆమె చేతికి వున్న నాలుగు బంగారు గాజులను లాక్కుని పోయారన్నారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. డిఎస్‌పి విఎన్‌కె చైతన్య ఆదేశాల మేరకు ఎస్ఐ ధరణిబాబు, సిబ్బందితో కలిసి నిందితులను పట్టుకుని వారి వద్ద నుండి 5 తులాల మాంగల్యచైను, 5 తులాల బంగారు గాజులు, నేరానికి ఉపయోగించిన ఒక కత్తి, స్కూటీని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న కానిస్టేబుల్ రాజశేఖర్, రఫిలను డిఎస్‌పి, సిఐ ప్రత్యేకంగా అభినందించి రివార్డు అందచేశారు.



కానిస్టేబుల్ రాజశేఖర్‌కు రివార్డు అందచేస్తున్న సిఐ

## ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే మన జగనన్న లక్ష్యం - సిఇఓ



వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్‌ను ప్రారంభిస్తున్న సిఇఓ

**యల్లనూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**

గ్రామాల్లో మౌళిక సదుపాయాలు కల్పించి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాన్నలదే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని రాష్ట్ర విద్య సంస్కరణల పర్యవేక్షణ సిఇఓ ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని 85 నిట్టూరు గ్రామంలో నూతన వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్, రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా సర్పంచులు శారద, ప్రభాకర్‌రెడ్డి, వైకాపా నాయకులు సిఇఓకు ఘనంగా పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అనంతరం సిఇఓ రైతు భరోసా కేంద్రంతో పాటు వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్ భవనాలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఇఓ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో వుంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఉపయోగపడే మందులు అందుబాటులో వుంచాలని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమాదేవి, ఇన్‌చార్జ్ ఎంపిడిఓ రామచంద్రారెడ్డి, ఇఓఆర్‌డి విజయశేఖర్‌నాయుడు, జెడ్‌పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు కిరణ్‌కుమార్, వనం రవి, కేశవరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ ప్రసాద్, అగ్రికల్చర్ ఎఓ రామకృష్ణ, మండల జె నరేం ద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ సుప్రజరెడ్డి, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## పంట మునిగింది కాదు పార్కు మునిగిందని జె.సి ఏడుపు

**- జె.సి ప్రభాకర్‌రెడ్డిపై మండిపడ్డ పెద్దపప్పూరు వైసిపి నాయకులు**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

**తాడిపత్రిటౌన్, పెద్దపప్పూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త**

చాగల్లు ప్రాజెక్ట్ నుండి పెద్దఎత్తున నీటిని విడుదల చేయడంతో పంట పొలాలు మునిగి రైతులకు నష్టం వాటిల్లిందని జె.సి ప్రభాకర్‌రెడ్డి ముసలి కన్నీరు కారుస్తున్నారని తాడిపత్రి పట్టణంలో పెన్నానది ఒడ్డున జాయ్ పార్కు మునిగిందనే తన ఏడుపు అని పెద్దపప్పూరు వైసిపి నాయకులు మండిపడ్డారు. తాడిపత్రి పట్టణంలోని వైసిపి కార్యాలయంలో బుధవారం పెద్దపప్పూరు వైసిపి నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపప్పూరు ఎంపిపి రామ్మూర్తిరెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి, జిల్లా పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం చాగల్లు ప్రాజెక్ట్ నుండి పెద్దఎత్తున నీరు దిగువకు రావడంతో రైతులు ఇబ్బందులు పడ్డారని అధికారుల తప్పిదంతోనే ఇలా జరిగిందని పెద్దపప్పూరు పోలీసుస్టేషన్‌లో తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి చాగల్లు ప్రాజెక్ట్ అధికారులపై ఫిర్యాదు చేశారన్నారు. పెద్దపప్పూరు మండలం, చాగల్లు ప్రాజెక్ట్‌పై ఏమాత్రం అవగాహన లేని ఆయన ఫిర్యాదు చేశారన్నారు. పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తున్న తరుణంలో చాగల్లు ప్రాజెక్ట్‌లో ఎద్దఎత్తున నీరు చేరుతోంది దీన్ని దృష్టిలో వుంచుకుని ప్రాజెక్ట్ అధికారులు 7 గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు. అలా నీరు వదలకపోయి వుంటే ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ వల్ల మండలంలోని దేవునిఉప్పలపాడు, ఉల్లికల్లు గ్రామాలకు ఇబ్బందులు ఎదురయ్యేవన్నారు. ఎవరు పంటలు మునిగిపోయి నష్టాలు పడాలని ఎవరి ఉద్దేశ్యం కాదని ప్రకృతి సహకరించని కారణంగానే అధిక మొత్తంలో నీటిని విడుదల చేయాల్సి వచ్చిందన్నారు. రైతులపై ఏనాడు ప్రేమ చూపని జె.సి ప్రభాకర్‌రెడ్డి తన పార్కు మునిగిందనే అధికారులపై బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాడిపత్రి ఇన్‌చార్జ్‌గా ఆనాడు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ముచ్చుకోట నుండి పెద్దపప్పూరు వరకు పాదయాత్ర చేస్తున్న సమయంలో గ్రామాల్లో నెలకొన్న నీటి ఎద్దడి తాగునీటి సమస్యలు మండల ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారని నీటి సమస్యలు పరిష్కరించి ప్రాజెక్ట్‌లకు నీటిని తీసుకవస్తానని ఆనాడు హామి ఇచ్చి నేడు ప్రాజెక్ట్‌లను నిండుకుండలా నీటితో నింపి రైతుల కష్టాలు తీర్చారన్నారు. అంతేకాకుండా తాడిపత్రి నియోజకవర్గానికి 159 కోట్లు తీసుకొచ్చి రైతుల కష్టాలను తీర్చిన ఘనత ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి దక్కుతుందన్నారు. జె.సి ప్రభాకర్‌రెడ్డి, జె.సి దివాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా, ఎంపిగా వున్న సమయంలోనే చాగల్లు ప్రాజెక్ట్ నిర్మాణం జరిగిందని ఆ సమయంలో ఏనాడు ప్రాజెక్ట్‌కు నీటిని తీసుకరావాలన్న ఆలోచన కూడా లేదని వచ్చిన అరకొర నీటిని జూటూరు వద్ద వున్న తన వ్యవసాయ పొలంలో పెన్నానదికి అడ్డుగా కట్టలు కట్టి తన పొలంలోకి నీటిని మళ్లించుకున్న ఘనత వారికే దక్కుతుందని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు ముచ్చుకోట యోగేశ్వర్‌రెడ్డి, గార్లదిన్నె సింగిల్‌విండో అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి, పెద్దఎక్కలూరు నాగేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని శవం లభ్యం



బావిలో తేలిన గుర్తు తెలియని శవం

**నల్లచెరువు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఓరువాయి గ్రామ పంఛాయతీలోని మల్లిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని బావిలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని శవం బావిలో పైకి తేలడంతో ఆ గ్రామానికి చెందిన గ్రామస్తులు గమనించడంతో ఈ సమాచారాన్ని స్థానిక పోలీసులకు అందించారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తుది జాబితా విడుదల

**అనంతపురం టౌన్, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:**

జోన్ 4 పరిధిలోని ఏ.పిమోడల్ స్కూల్స్ నందు పిజిటి మరియు టిజిటి కాంట్రాక్ట్ పద్ధతిన తాత్కాలిక నియామకాలకు సంబంధించి అభ్యంతరములను పరిశీలించిన తరువాత తుది మెరిట్ జాబితాను ://నాడునేడు.ఎస్ఈ.ఎపి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరచడమైనది. అంతేకాకుండా మెరిట్ లిస్టును అనుసరించి సబ్జెకు వారీగా ఖాళీలకు అనుగుణంగా 1:2 నిష్పత్తిలో ఒరిజినల్ సర్టిఫికేట్స్ పరిశీలనకు మరియు డెమోకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను కూడా పొందుపరచడం జరుగుతుంది. కావున అభ్యర్థులకు తెలియజేయడం ఏమనగా ధృవపత్రాల పరిశీలన మరియు డెమోకు ఎంపికైన అభ్యర్థులందురూ ఆయా సబ్జెక్టుల వారీగా కేటాయించిన జిల్లా విద్యాశాఖాధికారుల కార్యాలయం నందు ధృవపత్రాల పరిశీలనకు తెలపబడిన తేదీలలో హాజరు కావలెను. అభ్యర్థులకు తగు సమాచారాన్ని సెల్‌ఫోన్ ద్వారా పంపడం జరుగుతుంది. ఎంపిక అంతయూ ప్రతిభ ఆధారంగా పారదర్శకంగా జరుగుతుంది. దళారులను నమ్మి మోసపోవద్దు, ఎవరైన అవినీతి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు.

